సాక్షి
జోగుళాంబ గద్వాల

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



మసకబారుతోంది..

ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి ఏర్పాటు చేసిన జీసీసీ మనుగడ మసకబారుతోంది.

వివరాలు 8లో ▸



ఆపద మొక్కుల వాడ..

ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.2/23.1

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

అక్రమార్కుల్లో వణుకు

గట్టు ఎత్తిపోతల పరిహారంలో అక్రమాలపై సీబీఐకి ఫిర్యాదు

- గతంలో భూపరిహారం పేరిట రూ.కోట్లు పక్కదారి
- డబుల్ క్లెయిమ్‌లు, రైతులే కాని వారి పేరిట కాజేసిన వైనం
- అప్పటి ఆర్డీఓ, రెవెన్యూ, భూసేకరణ ఉద్యోగులు, సిబ్బందిపై ఫిర్యాదుల వెల్లువ
- నాడు అధికార పలుకుబడితో తప్పించుకున్న వైనం
- తాజాగా ప్రభుత్వం మారడంతో అవినీతిపరుల గుండెల్లో దడ



గద్వాల రూరల్: జోగుళాంబ గద్వాల జిల్లా ఉమ్మడి గట్టు మండలంలోని బీడు భూములకు నీరందించి సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం గట్టు ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. ఎడారి ప్రాంతాన్ని సస్యశ్యామలం దేవుడెరుగు కానీ ఈ ఎత్తిపోతల నిర్మాణం, పనుల్లో కోల్పోయిన భూములకు చెల్లించే పరిహారాన్ని ఆసరాగా చేసుకొని కొందరు అక్రమార్కులు రూ.కోట్లు కొల్లగొట్టారు. ఇందులో అప్పటి ప్రభుత్వ హయాంలో పలుకుబడి ఉన్న కొందరు నాయకులతో పాటు ఓ రెవెన్యూ డివిజనల్ అధికారి, మరికొందరు రెవెన్యూ, భూసేకరణ ఉద్యోగులు ఉన్నారు. వీరంతా కలిసి దొరినకాడికి దోచుకున్నారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ఈ అక్రమాలపై ఎంతోమంది ఫిర్యాదు చేసినా.. రాజకీయ పలుకుబడి సాయంతో తప్పించుకున్నారు. కానీ, చేసిన పాపం ఊరికే పోదు అన్నట్టు గట్టు ఎత్తిపోతల పరిహారంలో చోటుచేసుకున్న అక్రమాలపై తాజాగా సీబీఐకి ఫిర్యాదు చేయడంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. పరిస్థితులు తారుమారవడం.. ఎప్పుడు ఎక్కడి నుంచి ఏ ఉపద్రవం వచ్చిపడుతుందోనని ఆందోళన నెలకొంది. సీబీఐకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో గట్టు, నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాల నిర్మాణం పనుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై పూర్తి వివరాలిలా..

డబుల్ క్లెయిమ్‌లతో స్వాహా

2013లో ధరూరు మండలం మార్లబీడు నుంచి గట్టు వరకు వేసిన రోడ్డులో తుమ్మలచెర్వు శివారులో పరిహారాన్ని దోచేందుకు అక్రమార్కులు ఓ పథకం వేశారు. ఇందుకోసం అప్పట్లో భూసేకరణ కార్యాలయంలో ఇన్‌చార్జ్‌గా పనిచేసిన అధికారి సాయంతో సుమారు 30 ఎకరాలకు సంబంధించిన పరిహారాన్ని డబుల్ క్లెయిమ్ చేశారు. మొదటి విడతలో పరిహారం తీసుకున్న లబ్ధిదారులు తమ భూములకు ఎక్కువ పరిహారం పొందేందుకు కోర్టును ఆశ్రయించవచ్చు. డబుల్ క్లెయిమ్ చేసేందుకు అప్పట్లో పనిచేసిన సదరు కీలక అధికారి సాయంతో వేసిన పథకం కాస్త గద్వాల న్యాయశాలలో బయటపడడంతో అప్పట్లో విషయం హాట్‌టాపిక్‌గా మారింది.

నకిలీ ధ్రువపత్రాలతో అక్రమాలు..

ఇదిలాఉండగా, గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా 955.45ఎకరాలు ముంపునకు గురవుతుంది. ఇందులో 574 ఎకరాల భూమి అసైన్డ్ భూమి ఉంది. ఇక్కడ సైతం సదరు కీలక డివిజనల్ అధికారి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. భూసేకరణ కార్యాలయంలో తనకు అనుకూలంగా ఉండే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సాయంతో నిజమైన రైతులను పక్కన పెట్టి ఫేక్ పట్టాలు సృష్టించి రైతులు కాని వారి పేరిట పరిహారం ఎత్తేశారు. ప్రభుత్వ నిబంధనలోని పొజిషన్ అంశాన్ని ఆసరాగా చేసుకుని ఏకంగా జిల్లా ఉన్నతాధికారిని సైతం పక్కదారి పట్టించి అక్రమాలకు తెగబడినట్లు తెలిసింది. దీంతో నిజమైన లబ్ధిదారులు తమ భూములు ముంపునకు గురైనప్పటికీ పరిహారం రాక ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దుస్థితి. బదిలీ అయిన సదరు వివాదాస్పద అధికారి పేరిట పాత తేదీలతో సుమారు మూడు నెలల పాటు భూసేకరణ ఆఫీసులో లావాదేవీలు కొనసాగాయంటే సదరు అధికారి ఎంతపెద్ద మొత్తంలో వెనకేసుకున్నారనేది స్పష్టమవుతుంది.

గట్టు ఎత్తిపోతలలో ముంపునకు గురవుతున్న మార్లబీడు-గట్టు మధ్యలో ఉన్న రహదారి



చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో సైతం..

గట్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా గట్టు మండలంలో చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను నిర్మాణం చేశారు. ఇందులో సర్వే నంబర్లు 421, 437, 429, 268, 247, 307, 412, 423, 410లో మొత్తం 312 ప్రభుత్వ అసైన్డ్ భూమి ముంపునకు గురైంది. ఇందులో మొదటి అవార్డులో 68ఎ కరాలకు పరిహారం మంజూరైంది. పరిహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ 2021–22 సీఎం కార్యాలయానికి ఫిర్యాదు వెళ్లాయి. దీంతో కొంతకాలం వరకు దీనిని పక్కన పెట్టేశారు. అయితే తను బదిలీ అవుతానని ఏం చేసినా ఇబ్బంది ఉండదనుకున్న సదరు వివాదాస్పద డివిజనల్ అధికారి ఈ భూముల రికార్డులను కూడా బయటకు తీసి వీటిపై ప్రజాధనాన్ని దోచేందుకు యత్నించడం అప్పట్లో కలకలం రేపింది. దీనిపై అక్రమార్కులకు అనుకూలించేలా సర్వే రిపోర్టు, ఫేక్ రైతుల జాబితా సిద్ధం చేసి తుది నివేదిక కోసం గట్టు తహసీల్దార్ కార్యాలయానికి పంపారు. దీని వెనకాల మండలానికి చెందిన పలుకుబడి ఉన్న నాయకులతో మిలాకత్ అయి ప్రజాధనాన్ని కాజేసేందుకు యత్నించిన వైనాన్ని 'సాక్షి' అప్పట్లో వెలుగులోకి తీసుకురావడంతో బెదిరిన అధికారులు ఫైలును పక్కనపెట్టేశారు. ఇదే విషయాన్ని గతంలో గట్టు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన అధికారే చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

సీబీఐకి ఫిర్యాదుతో కలకలం

తాజాగా గట్టు ఎత్తిపోతల పథకంలో చోటుచేసుకున్న పరిహారం అక్రమాలపై కేటీదొడ్డి, గట్టు మండలాలకు చెందిన కొందరు బాధితులు సీబీఐకి సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేయడం జిల్లా అధికార వర్గాల్లో కలకలం రేగింది. ప్రధానంగా వివాదాస్పుడిగా ముద్రపడ్డ సదరు డివిజనల్ అధికారిని కీలకసూత్రధారిగా పేర్కొంటూ అక్రమాలకు సహకరించిన మరికొంతమంది రెవెన్యూ, భూసేకరణ ఉద్యోగులు, సిబ్బందిపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై సీబీఐ అధికారులు త్వరలోనే విచారణ చేపట్టనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జిల్లాలో చోటుచేసుకున్న పరిహారం అక్రమాలపై సీబీఐ విచారణ జరిపితే అధికారులతో పాటు, పలుకుబడి కలిగిన కొందరు రాజకీయ నాయకుల పాత్రలు వెలుగులోకి వస్తాయనే ప్రచారం వినిపిస్తుంది. నేడు రాష్ట్రంలో ప్రభుత్వం.. జిల్లాలో పరిస్థితులు పూర్తిగా మారడంతో సదరు అధికారులు, నాయకుల్లో వణుకు మొదలైంది.

❐ ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులను సంప్రదించగా.. స్పందించేందుకు నిరాకరించారు.

జోగుళాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలసి ఆహ్వానిస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో ఈ నెల 14వ తేది జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా పలువురు ప్రముఖులను ఆలయ పాలకమండలి సభ్యులు కలిసి ఆహ్వానించారు. శక్రవారం కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ రితీరాజ్, జెడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య, అడిషనల్ కలెక్టర్లు అపూర్వచౌహాన్, చీర్ల శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ కేశవ్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తదితరులను కలసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అలాగే అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ పాలకమండలి సభ్యులు, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్, వెంకటనారయణరెడ్డి ఉన్నారు.

వారోత్సవం.. రథోత్సవం

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం వారోత్సవం సందర్భంగా ప్రదోశ కాలంలో జరిగిన రథోత్సవం భక్తులను మంత్రముగ్దులను చేసింది. ఆలయంలో ప్రతీవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా ఉదయం అమ్మవారి యాగశాలలో సామూహిక చండీహోమాలు సైతం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హోమాల్లో పాల్గొన్నారు. అదే విధంగా సంతాన స్వరూపిణి రేణుకాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అండర్ పాస్ రోడ్డుకు స్థల పరిశీలన



అండర్‌పాస్ రోడ్డు నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

అయిజ: మండల కేంద్రంలోని పర్థిపురం శివారులో అండర్ పాస్ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం తహసీల్దార్ షహిదాబేగం, ఆర్‌ఐలు దుర్గాసింగ్, మద్దిలేటి పర్థిపురం శివారులోని అండర్‌పాస్ రోడ్డు నిర్మించాల్సిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భారత్ మాల ఆరు వరుసల రోడ్డు నిర్మాణంలో రైతుల పంటపొలాలకు సంబంధించిన రోడ్డు పోతుండడంతో సమస్యను పరిష్కరించేందుకు అండర్ పాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు కలెక్టర్‌ను కోరారన్నారు. మండలంలోని జడదొడ్డి, అయిజ, తూంకుంట, పర్థిపురం గ్రామాల రైతులతోపాటు మల్దకల్ మండలానికి చెందిన రైతులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో అండర్ పాస్ నిర్మాణంకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు సంబంధించిన రైతులు పాల్గొన్నారు.

అంతరించిపోతున్న కళలకు ప్రాణం



పద్మశ్రీ అవార్డు గ్రహీత కొండప్పను సన్మానిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో హోలియ దాసరి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్పను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పూలమాల, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అంతరించిపోతున్న కళలను కేంద్రం గుర్తించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, సాకేత్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, హోలియా దాసరి సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు

గద్వాల: ఎస్సెస్సీ పరీక్షలకు మరో 45 రోజుల కాలం మిగిలి ఉందని.. పరీక్షలలో విద్యార్థులు విజయం సాధించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి నిలపాలని.. ఎస్సెస్సీలో ఏ ఒక్క విద్యార్థి అనుత్తీర్ణత కాకుండా వారిని పరీక్షలకు సన్నద్ధం చేయాలని అడిషనల్ కలెక్టర్ చీర్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బాలభవన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహ పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రేరణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి పదికి పది జీపీఏ సాధించాలని సూచించారు. వసతిగృహాల్లో చదివే విద్యార్థులందరూ నిరుపేద కుటుంబాల పిల్లలే ఉంటారని, వీరికి నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే చదువు అన్నింటికి మూలమన్నారు. అనంతరం ప్రముఖ సైకాలజిస్టు లక్ష్మణ్ మాట్లాడుతూ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలనే దానిపై వివరించారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో సాధన చేస్తే ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. సొంతంగా ఆలోచించడం, నిరంతర సాధన చేయడం విద్యార్థులు మరువరాదన్నారు. కార్యక్రమంలో సంక్షేమశాఖల జిల్లా అధికారులు శ్వేతప్రియదర్శిణి, సరోజ, ప్రవీల, సుజాత, సుధీర్, శేఖర్, జయరాం, హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

కమీషన్లకు కక్కుర్తిపడి.. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూర్: తెలంగాణ ఆవిర్భావం తర్వాత పదేళ్లపాటు పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తిపడి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్ర శుక్రవారం రాత్రి వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌కు చేరుకోగా ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.94 వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం, రూ.27 వేల కోట్లతో నిర్మించిన పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుల ద్వారా కొత్తగా ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే శుభవార్త వినిపించనున్నారని కొడంగల్– పేట పథకం ద్వారా మక్తల్ నియోజకవర్గంలోని 25 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని వెల్లడించారు. సంగంబండలో ముంపునకు గురైన బాధితులకు పరిహారం అందలేదని, వారికి రావాల్సిన రూ.30 కోట్ల పరిహారం నెలరోజుల్లోగా అందిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో సౌమ్యుడైన వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి విధంగానే.. కేంద్రంలోనూ అధికారంలోకి తెచ్చేందుకు అత్యధిక ఎంపీ సీట్లను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, ఈర్లపల్లి శంకర్, ఒబేదుల్లా కొత్వాల్, నాగరాజుగౌడ్, ప్రశాంత్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న జంగయ్య

గద్వాల: రాష్ట్రంలో గత పదేళ్ల కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మకాన్ని వమ్ము చేయదనే విశ్వాసంతో ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలున్నాయని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య కోరారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు గల న్యాయపరమైన ఆటంకాలను తొలగించి ప్రక్రియను తిరిగి ప్రారంభించాలన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావారవి మాట్లాడుతూ ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే, ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్న జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి పది శాతం నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్‌లోని మూడు డీఏలును, పీఆర్సీ ఆరియర్లను, ఇతర ట్రెజరీ బిల్లులను త్వరగా క్లియర్ చేయాలని కోరారు. పండిట్లు, పీఈటీల అప్‌గ్రేడ్ సమస్యపై దృష్టి సారించాలని సూచించారు. జీవో 317 వలన స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు, స్పౌజ్‌లకు న్యాయం చేయాలని కోరారు. కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూల్, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఫిబ్రవరి 18న గద్వాలలో జరపాలని తీర్మానించారు. రవిప్రసాద్, తిప్పన్న, గోపాల్, రమేష్, చక్రధర్, ఎస్వీరమణ, చంద్రకాంత్, తిలక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మళ్లీ మొండిచేయి!

- ఈసారి రైల్వే బడ్జెట్‌లోనూ దక్కని కేటాయింపులు
- కృష్ణా– వికారాబాద్, గద్వాల– డోర్నకల్ లేన్లకు లభించని మోక్షం
- అంచనాలు ఉన్నప్పటికీ ఊసే లేకుండాపోయిన వైనం
- సర్వేలు చేపట్టి ప్రతిపాదనలు పంపినా విదిల్చని నిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, నూతన రైల్వే లైన్లకు నిధుల మంజూరుపై అన్యాయం జరిగిందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ముద్కేడ్– సికింద్రాబాద్ మీదుగా అకోల– డోన్ (పూర్ణ– ముద్కేడ్, బొల్లారం– మహబూబ్‌నగర్ మినహా) డబ్లింగ్ ప్రాజెక్టు కోసం రూ.220 కోట్లు కేటాయించారు. మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పూర్తయిన భాగాన్ని మినహాయించి ముద్కేడ్– డోన్ మధ్య ప్రాజెక్టు అమలు కోసం అంచనా తయారు చేశారు. గతేడాది బడ్జెట్‌లో మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు డబ్లింగ్ లైన్‌కు ఈ బడ్జెట్‌లో రూ.60 కోట్లు కేటాయించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు సెక్షన్ల ప్రకారం డబ్లింగ్ లైన్ చేపట్టే అవకాశం ఉంది.

సర్వేలకే పరిమితమా..?

ఈ బడ్జెట్‌లో కృష్ణా– వికారాబాద్, గద్వాల– డోర్నకల్ నూతన లేన్లకు నిధులు కేటాయిస్తారనే అంచనాలు ఉన్నప్పటికీ తీరా ఆ ఊసే లేకుండాపోయింది. 1988లో నారాయణపేట జిల్లా కృష్ణా నుంచి వికారాబాద్ 87 కిలోమీటర్ల మేర రూ.90 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే ఈ లేన్ కోసం ఐదుసార్లు సర్వే చేశారు. ఇటీవలే ఈ రైల్వే ప్రాజెక్టు కోసం ఫైనల్ లొకేషన్ (ఎఫ్‌ఎల్‌ఎస్)ను రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. ఈ లేన్ పరిధిలో 316 కిలోమీటర్ల వరకు సర్వే చేయనున్నారు. సర్వే కోసం రూ.7.91 కోట్లు నిధులు కూడా కేటాయించారు. అయినా బడ్జెట్‌లో ఈ లేన్‌కు నిధులు కేటాయించకపోవడంతో ఈ ప్రాంతవాసులు ఒకింత నిరాశకు గురయ్యారు.

గద్వాల– డోర్నకల్‌ది అదే పరిస్థితి..

గద్వాల– డోర్నకల్ (220 కిలోమీటర్లు) లేన్‌కు 1992లో రూ.190 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. గద్వాల– మాచర్ల లైన్ కోసం మూడుసార్లు సర్వే చేశారు. ఈ రైల్వేలైన్ కోసం ఆయా ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నారు. ఈ బడ్జెట్‌లో కూడా లేన్‌కు మళ్లీ నిరాశే మిగిలింది.



ఊసేలేని పలు ప్రతిపాదనలు

అచ్చంపేట– మహబూబ్‌నగర్– తాండూరు 180 కిలోమీటర్ల కొత్త రైల్వేలైను కోసం రూ.360 కోట్లతో గతంలో కేంద్రం ఆమోదం తెలిపింది. దీనికి ఇప్పటి వరకు నిధులు కేటాయించకపోవడంతో కాగితాలకే పరిమితమై ప్రతిపాదన దశలోనే ఉంది. 2007లో రూ.340 కోట్లతో ప్రతిపాదించిన జడ్చర్ల– నాగర్‌కర్నూల్– కొల్లాపూర్– నంద్యాల వరకు 170 కిలోమీటర్ల రైలు మార్గం ఆచరణలో అమలుకాలేదు. ఈ బడ్జెట్‌లో వీటి ఊసేలేకుండా పోయింది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల గడువు పొడిగింపు

గద్వాల అర్బన్: సాంఘిక, సంక్షేమ, **గిరిజన,** వెనుకబడిన తరగతుల సంక్షేమ, **సాధారణ** గురుకులాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, సీవోఈ కళాశాలలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు గడువును పొడగించినట్లు డీసీఓ రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గో, పదో తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని, www.trwreir.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షల్లో అర్హత పొందిన విద్యార్థులకు పాత జిల్లాను ఒక యూనిట్‌గా పరిగణించి సీట్లను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

వృత్తి నైపుణ్యం అవసరం



గద్వాల అర్బన్: మహిళా సాధికారత సాధించడానికి ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వృత్తి నైపుణ్యం ఎంతో ఉపయోగ పడుతుందని అడిషనల్ కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు అన్నారు. మహిళలకు సంకల్ప కార్యక్రమంలో భాగంగా ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ సమన్వయంతో జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మహిళలు టైలరింగ్, బ్యూటీషియన్ వంటి రంగాల్లో తాము ఉన్న ప్రాంతాల్లోనే స్వయం ఉపాధి పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ కేంద్రం యాదగిరి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ప్రియాంక, మున్సిపల్ కమీషనర్ నర్సింహ, మాస్టర్ ట్రైనర్ శ్రీరామరాయలు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి




రాజోళి: మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, వారి వయసుకు తగినట్టుగా బరువు ఉండేలా పిల్లల తల్లిదండ్రులకు కూడా పౌష్టికాహార విలువల గురించి తెలియచేయాలని సీడీపీఓ సుజాత అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముండ్లదిన్నె,చింతల్ క్యాంపు, పెద్దతాండ్రపాడు గ్రామాల్లోని కేంద్రాలను సందర్శించిన ఆమె చిన్నారుల బరువు,ఎత్తు తదితర అంశాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు అంగన్‌వాడీలో నేర్పుతున్న అంశాలను అడిగి తెలుసుకుని, చిన్నారులతో మాట్లాడారు. బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా ఆరోగ్య సూచనలు అందచేయాలని, వారికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లక్ష్మి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,649

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు శుక్రవారం 1,277 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6649, కనిష్టం రూ. 3499, సరాసరి రూ. 6070 ధరలు పలికాయి. అలాగే, 5 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ. 5521, కనిష్టం రూ. 5311, సరాసరి రూ. 5311 ధరలు వచ్చాయి. 81 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ. 10,013, కనిష్టం రూ. 9606, సరాసరి రూ. 10,012 ధరలు పలికాయి.

16న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



గద్వాల అర్బన్: ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సంతకాల సేకరణ చేపట్టారు. అదేవిధంగా పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వివి నర్సింహ్మ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో సమ్మెను కార్మికులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉప్పేరు నర్సింహ్మ, బాలు విష్ణు, రాజేష్, వెంకటన్న, రాజు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

తాడూరులో విషాదఛాయలు

● రోడ్డు ప్రమాదంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మృతి


వెంకట్రావు (ఫైల్)

ఉప్పునుంతల: మండలంలోని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లికి చెందిన మాధవరం వెంకట్రావు (46) కుటుంబంతో కలిసి అచ్చంపేటలోలో నివాసం ఉంటున్నారు. ఆయన మండలంలోని తాడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరేళ్లుగా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తన తల్లి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి నుంచి ఫోన్ రావడంతో మధ్యాహ్న సమయంలో పాఠశాల నుంచే కారులో బయలుదేరాడు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సమీపంలో కారును కంటైనర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకట్రావు భార్య శ్రీలక్ష్మి అచ్చంపేట మండలం పులిజాల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి మహిళ..

దేవరకద్ర: మండలంలోని వెంకటాయపల్లిలో శుక్రవారం ఉదయం రైలు కింద పడి మతిస్థిమితం లేని మహిళ మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాయపల్లి పక్క గ్రామమైన గద్దెగూడెంకు చెందిన ఈడిగి లక్ష్మి(48) మతిస్థిమితం లేక ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలియజేశారు.

ఆటో ఢీకొని మహిళ ..

హన్వాడ: రోడ్డు దాటుతున్న ఓ మహిళను ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ ముస్తాక్ అలీ కథనం మేరకు.. మండలంలోని కొనగట్టుపల్లికి చెందిన కావలి మంగమ్మ (35), ఆమె భర్త సాయిలు పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చారు. పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో మంగమ్మ ఓ దుకాణంలో మద్యం సీసా కొనుక్కొని రోడ్డు దాటుతుండగా కొనగట్టుపల్లి నుంచి జిల్లాకేంద్రానికి పాలు తరలిస్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మంగమ్మకు భర్త, ఓ కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రమాదం



కోస్గి: ముందుగా వచ్చే వాహనానికి సైడ్ ఇచ్చే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని గుండ్లపల్లికి చెందిన చెన్నయ్య కోస్గి నుంచి సొంత గ్రామానికి ఖాళీ ట్రాక్టర్ తీసుకెళ్తున్నాడు. పాతర్లగడ్డ ఆంజనేయస్వామి ఆలయం దాటిన తర్వాత ముందుగా ఓ ఆటో రావడంతో సైడ్ ఇచ్చే క్రమంలో ఒక్కసారిగా ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. అప్రమత్తమైన డ్రైవర్ జాగ్రత్త పడి ట్రాక్టర్ నుంచి దూకాడు. కాగా ఆ సమయంలో జనాలు రోడ్డుపై లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



గోపాల్‌పేట: మండలంలోని ఏదుట్ల సమీపంలో ప్రమాదకర మలుపు వద్ద త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి 11గంటల ప్రాంతంలో గోపాల్‌పేట నుంచి ఏదుల వైపు టిప్పర్ వాహనం లోడ్‌తో వెళ్తుంది. ఏదుట్ల సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా ప్యాసింజర్ ఆటో రావడంతో డ్రైవర్ టిప్పర్‌ను రోడ్డు దింపాడు. దీంతో టిప్పర్ బోల్తా పడింది. ఘటనలో టిప్పర్ డ్రైవర్ చిన్నపాటి గాయాలతో బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒకవేళ ఎదురుగా వస్తున్న ఆటోకి ఢీకొట్టి ఉంటే తీవ్ర ప్రాణ నష్టం జరిగి ఉండేదని తెలిపారు. ఇదే స్థలంలో నెలరోజుల క్రితం ఆటోను బస్సు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న మహిళ కాలు విరిగింది. ప్రమాదకర మలుపు వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మసకబారుతున్న మనుగడ

● జీసీసీలో ఆగిపోయిన అటవీ ఉత్పత్తుల సేకరణ
● బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న చెంచులు
● భారమైన నిర్వహణ.. జీతాలు చెల్లించలేని దుస్థితి
● ఉద్యోగులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని విమర్శలు


మన్ననూర్‌లో జీసీసీ కార్యాలయం

మన్ననూర్: ఆదివాసి చెంచుల ఆర్థికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన గిరిజన కోఆపరేటివ్ సంస్థ (జీసీసీ) మనుగడ మసకబారుతోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివాసి చెంచుల అభివృద్ధి కోసం 1957లో మొట్ట మొదట ఏర్పడింది జీసీసీ. అప్పట్లో కనీసం రవాణా సౌకర్యం కూడా లేని సమయంలో మారుమూల ప్రాంతాల్లో నివశించే చెంచుల వద్దకు వెళ్లి ఆదరించిన చరిత్ర జీసీసీది. ప్రత్యేకించి నల్లమల అటవీ లోతట్టు ఏజెన్సీ ప్రాంతాలైన అమ్రాబాద్, లింగాల, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ మండలాల్లోని సుమారు 88 గ్రామాలు, చెంచు పెంటల్లోని చెంచులు సేకరించిన అటవీ ఉత్పత్తులను వారి వద్ద నుంచి కొనుగోలు చేసి వాటికి బదులుగా నిత్యావసర సరుకులు అందజేసేవారు. సేద్యానికి అనుకూలంగా ఉన్న అప్పాపూర్ లాంటి పెంటల్లో పోడు భూములు సాగు చేసుకునేందుకు వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు సబ్సిడీపై అందజేసేవారు. అప్పట్లో వ్యవసాయ రుణాలు కూడా జీసీసీ ద్వారా చెంచులకు మంజూరు అయ్యేవి. ఇప్పటికీ నిత్యావసర సరుకులు కొంత మొత్తంలో చెంచులకు అందిస్తూనే ఉన్నారు.

తగ్గుతున్న సేకరణ

కాలానుగుణంగా అటవీ ఉత్పత్తుల వృక్షాలు క్రమక్రమంగా నశించిపోతుండటంతో అటవీ ఉత్పత్తుల సేకరణ తగ్గిపోతోంది. ప్రస్తుతం ఇసముష్టి గింజలు, గుడిపాల వేర్లు, మారేడు గడ్డలు, కుంకుడు కాయలు, ఇప్పపూలు, చీపుర్లు మాత్రమే చెంచులు అడవి నుంచి సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా మన్ననూర్ హెడ్‌క్వార్టర్ పరిధిలో 8 మంది అవుట్ సోర్సింగ్, 4 కాంట్రాక్టు, 14 మంది రెగ్యులర్ సిబ్బందితోపాటు అకౌంటెంట్, బ్రాంచ్ మేనేజర్ విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు సుమారు రూ.12 లక్షల పైచిలుకు జీతాలు అవసరం. ఈ క్రమంలో 60 శాతం జీతాలు సంబంధిత శాఖ భరిస్తుండగా.. 40 శాతం జీసీసీ ద్వారా వచ్చే లాభాలలో సరి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం అటవీ ఉత్పత్తులు కొనుగోలు పూర్తిగా పడిపోవడం, హాస్టళ్లకు నిత్యావసరాలు, కాస్మోటిక్స్ సరఫరా ద్వారా వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రతినెలా జీతాలు చెల్లించడం ప్రభుత్వానికి కొంత భారంగా మారింది.


గుడిపాల వేర్లు పరిశీలిస్తున్న జీసీసీ ఉద్యోగులు

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

గతంలో అటవీ ప్రాంతంలో సేకరించే అటవీ ఉత్పత్తులు జిగురు, తేనె, మారేడు గడ్డలు, ఇసముష్టి గింజలు, మొర్లి పప్పు, చిల్లగింజలు, కుంకుడు కాయలు, గుడిపాలవేర్లు, ఇప్పపూలు, ఇప్ప పలుకు, చీపురు పుల్లలు, జీసీసీకి సంబంధించిన వివిధ బ్రాంచీలలో అమ్మేవారు. ప్రస్తుతం అటవీ ఉత్పత్తులకు జీసీసీ ఇచ్చే ధర గిట్టుబాటు కావడం లేదని చెంచులు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్న వారిని, కొనుగోలు చేస్తున్న వారిని అడ్డగించాల్సిన జీసీసీ ప్రేక్షక పాత్ర వహిస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

■ జీసీసీ పరిధిలోని సుమారు 98 హాస్టళ్ల విద్యార్థులకు నిత్యావసరాలు జీసీసీ ద్వారా పంపిణీ చేస్తుంటారు. ఈ క్రమంలో ఏడాదికి సుమారు రూ.10 కోట్ల పెట్టుబడితో సరుకులు సరఫరా చేస్తే వీటి ద్వారా మార్కెట్ ధరలో 5 శాతం మాత్రమే లాభాలు ఉంటాయి. వీటిలోనే ఉద్యోగులకు 40 శాతం జీతాల చెల్లింపు, రవాణా తదితర ఖర్చులు కూడా భరించాల్సి ఉంటుంది.

మంచి రోజులు వస్తాయి



చెంచుల అభివృద్ధి, సంక్షేమం కోసమే జీసీసీ ఏర్పడింది. అనివార్య పరిస్థితులతో ప్రస్తుతం కొంత ఇబ్బంది కలుగుతుందనడంలో వాస్తవం ఉంది. ఐటీడీఏ పీఓ (కలెక్టర్), సంస్థ ఉన్నతాధికారులు అటవీ ఉత్పత్తులకు సంబంధించిన వృక్షాలను అటవీ ప్రాంతంలో పెంచేందుకు సమాలోచనలు చేస్తున్నారు. ప్రత్యేకించి ప్రస్తుతం డిమాండ్‌లో ఉన్న మారేడు వృక్షాలను పెంచేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఆసక్తి కలిగిన 50 మంది చెంచులతో ప్లాంటేషన్లు ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. అలాగే ఇతర ప్రాంతాల్లో ఉన్న ధరల కంటే కొంత ఎక్కువ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోనున్నారు. – సంతోష్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్, మన్ననూర్

వసూళ్ల అడ్డా.. నందిన్నె చెక్‌పోస్టు?



కేటీదొడ్డి: తెలంగాణ–కర్ణాటక రాష్ట్రాల మధ్య అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మండలంలోని నందిన్నె వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుచేసి సివిల్, ఎక్సైజ్‌శాఖ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. కృష్ణానదిపై వంతెన నిర్మాణం కొనసాగుతుండటంతో వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఈ చెక్‌పోస్టు మీదుగా వెళ్తున్న లారీలు, డీసీఎంలు, టిప్పర్లు, బొలెరో తదితర వాహనాల డ్రైవర్ల నుంచి చెక్‌పోస్టు సిబ్బంది రూ.100 నుంచి రూ.300 వరకు వసూటు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని ధ్రువ పత్రాలు సరిగా ఉన్నా మాముళ్ల కోసం వేధిస్తున్నారని పలువురు డ్రైవర్లు వివరించారు. మద్యం, ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే మామూళ్లకు అలవాటు పడ్డారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు నిలిపి డబ్బులు వసూలు చేస్తున్న వీడియోలు సైతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనాదారులు ఆరోపిస్తున్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు


బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ రవినాయక్ తదితరులు

మన్యంకొండ బ్రహ్మోత్సవాలపై కలెక్టర్ సమీక్ష

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందున గతేడాది కంటే ఎక్కువ మంది భక్తులు మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు వచ్చే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. ఈ నెల 19 నుంచి మార్చి 27 వరకు నిర్వహించనున్న మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లు, తాగునీరు, శానిటేషన్, మూత్రశాలలు, బందోబస్తు, రద్దీ నియంత్రణ తదితర వాటిపై శాఖల వారీగా చర్చించారు. భక్తులకు స్వామివారి దర్శనం సులభంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 24న స్వామివారి గరుడవాహన సేవ, రథోత్సవం, మార్చి 25న అలివేలు మంగతాయారు తిరు కల్యాణోత్సవం, రాత్రి రథోత్సవం ఉంటాయన్నారు. పోలీసు బందోబస్తు, ఆర్టీసీ తగినన్ని బస్సులు నడపాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ తరఫున కొండపైన, అలివేలుమంగ ఆలయాల వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, శిక్షణ ఐపీఎస్ చిత్తరంజన్, ఏఎస్పీ రాములు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీనివాసరాజు, మన్యంకొండ దేవస్థానం చైర్మన్ అలహరి మధుసూదన్, డీఎస్పీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార ముఠా గుట్టురట్టు

ఇద్దరు మహిళలు స్టేట్‌హోంకు, నిర్వాహకుడు రిమాండ్‌కు తరలింపు

గద్వాల క్రైం: గుట్టుగా వ్యభిచార వ్యాపారం నిర్వహిస్తున్న నిర్వాహకుడితో పాటు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు గద్వాల సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కేటీదొడ్డి మండలం మల్లాపురంతండాకు చెందిన వీరేష్‌నాయక్ కొన్నిరోజులుగా అమ్మాయిలు, మహిళలను లోబర్చుకొని వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. గత నెల 31న జిల్లాకేంద్రంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో సురేష్ అనే వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు. కాలనీవాసులు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించడంతో దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నామని సీఐ వివరించారు. మహిళల్లో ఒకరిది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్, మరొకరిది తిరుపతిగా గుర్తించామన్నారు. శుక్రవారం నిర్వాహకుడు వీరేష్‌నాయక్‌ను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు, మహిళలను స్టేట్‌హోంకు తరలించినట్లు వెల్లడించారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం


అమరచింతలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అమరచింత/మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, బీజేపీ పాలనలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అమ్ముకోవడమే పనిగా పెట్టుకున్నారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మక్తల్ పట్టణంలో ఉదయం 8 గంటలకు పాలమూరు న్యాయ యాత్ర ప్రారంభమైంది. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలో వార్డుల్లో పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో సాగు, తాగునీటితో పాటు పెండింగ్‌లో ఉన్న పునరావాస గ్రామాలకు నిధుల విడుదలకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల సాధనతో పాటు జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమవుతుందన్నారు. అమరచింత రాజీవ్ కూడలిలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి ముగ్గురు ప్రధానులను ఇచ్చిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. కేశం నాగరాజ్ గౌడ్, ప్రశాంత్ కుమార్‌రెడ్డి, శివసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, రవికుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషిచేస్తా


దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: దివ్యాంగుల సంక్షేమం కోసం కృషిచేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో 29 మందిని గుర్తించి అలింకో స్వచ్ఛంద సంస్థ సహకారంతో జిల్లా వెల్ఫేర్ అధికారి కృషి ఫలితంగా వీటిని అందజేశామన్నారు. ఇంకా చాలామంది ట్రైసైకిళ్లు కావాలని అడుగుతున్నారని, వారందరికీ ఇప్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. దివ్యాంగులు గౌరవంగా జీవించేందుకు వారి సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే గాను నేను, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్రైసైకిళ్లు అందజేసిన అలింకో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి, సూపరింటెండెంట్ అరుధంతి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ నాగరాజు పాల్గొన్నారు.

■ విద్యాయాత్రలో భాగంగా మాడ్రన్ హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమానికి దివ్యాంగుడు లాలయ్య వచ్చి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి తన గోడు వినిపించి ఎలక్ట్రికల్ ట్రైసైకిల్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జిల్లా సంక్షేమ శాఖ అధికారితో మాట్లాడి శుక్రవారం క్యాంపు కార్యాలయంలో దివ్యాంగుడికి ఎలక్ట్రికల్ ట్రైసైకిల్ ఇప్పించారు.

జొన్న పంట దగ్ధం


కాలిపోయిన జొన్న పంట

రాజోళి: విద్యుత్ తీగలు తెగి పడటంతో జొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలోని పెద్దధన్వాడలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన రైతు శ్రీను 5 ఎకరాల పొలంలో జొన్న సాగు చేశాడు. కాగా పొలం పక్కనే హైటెన్షన్ స్తంభాలపైనున్న వైరు తెగిపడటంతో మంటలు చెలరేగాయి. గమనించిన రైతులు లైన్‌మేన్‌కు సమాచారం ఇవ్వగా లైన్ నిలిపివేశారు. మంటలు ఆర్పేసరికే ఎకరా పంట కాలిబూడిదైంది. చేతికొచ్చిన పంట కాలిపోవడంతో రైతు లబోదిబోమన్నాడు. నష్టపోయిన రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విస్తరిస్తున్న డ్రోన్ సేద్యం


మొక్కజొన్న పంటకు డ్రోన్లతో పిచికారి

కూలీల కొరతతో వ్యవసాయంలో కొత్తపుంతలు

చిన్నంబావి: వ్యవసాయంలో అధునాతన పరికరాలతో రైతులు శ్రమను తగ్గించుకుంటున్నారు. గతంలో వరికోత మిషన్లను వినియోగించినప్పుడు అనేక మంది పెదవి విరిచారు. ఇప్పుడు వరికోత మిషన్ లేకుండా వరి పంట లేని పరిస్థితి వచ్చింది. అదేవిధంగా మూడేళ్ల క్రితం వ్యవసాయరంగంలోకి పురుగు మందుల పిచికారి కోసం ప్రవేశించిన డ్రోన్ వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తున్నది. గతేడాది మండలంలో ఒకరిద్దరు రైతుల వద్దే ఉండగా ఇప్పుడు కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు డ్రోన్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో మండలంలో ఇప్పుడు డ్రోన్ల సంఖ్య పదికి చేరింది. అనేక గ్రామాల్లో రైతులు మక్క, మినుము, పప్పుశనగ, మిరప పంటలను డ్రోన్ల సాయంతో పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రోన్ల వినియోగంపై అవగాహన పెంచేందుకు ఇటు ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ సంస్థలు కూడా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. దీంతో డ్రోన్లు కొనుగోలు చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కొందరు ఔత్సాహిక రైతులు బ్యాంకు రుణాల ద్వారా డ్రోన్లను కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో ఎకరాలకు డ్రోన్ ద్వారా మందును పిచికారి చేయవచ్చు. అంతేకాకుండా పురుగు మందు సైతం ఆదా అవుతుంది. డ్రోన్ సాయంతో రోజుకు 20 నుంచి 25ఎకరాల వరకు పిచికారి చేయవచ్చు. పెట్టుబడి ఖర్చు కొంత మేర తగ్గుతుంది. కేవలం పురుగుమందు పిచికారి మాత్రమే కాకుండా పంట మొత్తం ఒకే రీతిలో మందు పడుతుంది. పది మంది రైతులు చేసే పనిని డ్రోన్‌తో చేయవచ్చు.

ఉపాధి దొరికింది



మూడేళ్ల కిత్రం ఆంధ్రా నుంచి డ్రోన్‌ను కొనుగోలు చేశాం. ఆ సమయంలో అందరూ దీనిపై వ్యతిరేకంగా మాట్లాడటంతో చాలా భయపడ్డాం. కానీ మూడేళ్లలోనే ఒక్క చిన్నంబావి మండల పరిధిలో పది డ్రోన్ల వరకు విక్రయించాం. రానున్న రోజుల్లో ఇంకా ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం సైతం దీనిపై గ్రామాల్లో మా కంపెని తరుపున అవగాహన కల్పిస్తున్నాం.
–రాజ్ కుమార్, పెద్దమారు

డ్రోన్‌తో పిచికారి చేయిస్తున్నా..



నేను మూడు ఎకరాల్లో మినుము పంటను, రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. కూలీల కొరత ఎక్కువగా ఉండటంతో రెండేళ్లుగా డ్రోన్‌తో పురుగు మందులను పిచికారి చేయిస్తున్న దిగుబడి సైతం చాలా బాగా వచ్చింది. పురుగు మందు కూడా చాలా ఆదా అవుతుంది,
–ఉమేష్ నాయుడు, బొక్కెం గ్రామం

ముమ్మరంగా తనిఖీలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెండింగ్ ఈ–చలాన్స్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను శిక్షణ ఐపీఎస్ అధికారి చిత్తరంజన్ పరిశీలించారు. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు ట్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ తనిఖీలు జరిపి 35 ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించారు. అలాగే నంబర్ ప్లేట్ లేని వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. దీంతోపాటు వాహనదారుల నుంచి ఈ–చలాన్స్ చెల్లించే విధంగా అవగాహన కల్పించారు.

మహిళను మోసం చేసిన యువకుడికి పదేళ్ల జైలు శిక్ష


నిందితుడు పట్నం రాఘవేందర్

కోయిల్‌కొండ: మహిళను మోసం చేసిన వ్యక్తికి మహబూబ్‌నగర్ ఉమెన్ కోర్టు శుక్రవారం పదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించారు. కోయిల్‌కొండ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ కుమ్మరివాడికి చెందిన పట్నం రాఘవేందర్ వద్ద మండలంలోని ఇబ్రహీంనగర్‌కి చెందిన లింగుపల్లి రేఖ 2020 మార్చి నెలలో కూలి పని చేస్తుండేది. ఆ సమయంలో రేఖను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసి శారీరకంగా అనుభవించి గర్భవతిని చేశాడు. ఆమె అతడిని పెళ్లి చేసుకోవాలని కోరగా.. నిరాకరించాడు. దీంతో రేఖ కోయిల్‌కొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ సురేష్‌గౌడ్ కేసు నమోదు చేసి చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించాడు. మహబూబ్‌నగర్ స్పెషల్ ఉమెన్ కోర్టు విచారించి శుక్రవారం నిందుడితుడికి 10 సంవత్సరాల జైలుశిక్ష, రూ.5,500 జరిమానా విధించిందని పోలీసులు తెలియజేశారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ వర్సిటీ బీఎడ్ ఎంట్రన్స్ నోటిఫికేషన్

ఫిబ్రవరి 21 వరకు దరఖాస్తులకు గడువు.. మార్చి 5న పరీక్ష

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎడ్ (ఓడీఎల్) అర్హత పరీక్ష 2023–24కు నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఫిబ్రవరి 21గా విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రుసుము రూ.1000, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750 అని వివరించారు. మార్చి 5వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరీక్ష కేంద్రాల్లో బీఎడ్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. విద్యార్థులు పరీక్షకు రెండు రోజుల ముందు హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏఓయూ.ఏసీ.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏఓయూఆన్‌లైన్.ఇన్‌లో సంప్రదించాలని సూచించారు.

జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాలకు దరఖాస్తులు

5న నిథిమ్‌లో ఎంపికలు

సాక్షి, హైదరాబాద్: జపాన్‌లో హాస్పిటాలిటీ ఉద్యోగాల భర్తీకి ఆసక్తి ఉన్న హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిగ్రీ/డిప్లొమా చేసిన అనువజ్ఞులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఒక ప్రకట నలో తెలిపింది. అభ్యర్థుల కనీస వయసు 22 ఏళ్ల నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలని, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో డిగ్రీ లేదా డిప్లొమా చేసి అనుభవం కలిగి ఉండాలని వివరించింది. ఆసక్తి ఉన్న వారు టామ్‌కామ్ హెచ్‌ఆర్ మేనేజర్ ఫోన్ నంబర్ 8125251408లో సంప్రదించాలని, లేదా ఈమెయిల్ ద్వారా పంపించవ చ్చని వివరించింది. ఎంపిక ప్రక్రియను ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఎంపికైన వారికి జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చి అక్కడ పనిచేసేందుకు అవసరమైన అదనపు నైపుణ్యాలను నేర్పించనున్నట్లు వెల్లడించింది.

కుప్పాన్ని ఎండబెట్టి కుప్పి గంతులు!

రాజకీయ భిక్ష పెట్టిన పురిటిగడ్డకు చంద్రబాబు నయవంచన

కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తానంటూ నమ్మక ద్రోహం

- సాగు, తాగునీరు ముసుగులో అంచనా వ్యయం భారీగా పెంపు
- సీఎం రమేష్‌ను అడ్డుపెట్టుకుని ఖజానాకు కన్నం
- కుప్పంను మున్సిపాల్టీగా చేసి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసిన సీఎం జగన్
- కుప్పం బ్రాంచ్ కెనాల్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి కృష్ణా జలాల తరలింపు



కుప్పం బ్రాంచ్ కెనాల్ (ఫైల్)

సాక్షి, అమరావతి: కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా కృష్ణా జలాలను తరలించి సాగు, తాగునీరు అందిస్తానని నమ్మబలికిన స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఆ ముసుగులో ఖజానాను దోచేసి పనులు చేయలేక చేతులెత్తేసి నయవంచనకు పాల్పడ్డారు! 2022 సెప్టెంబరు 23న కుప్పం నియోజకవర్గ పర్యటన సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. పూర్తయిన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను ఈ నెలలోనే సీఎం జగన్ ప్రారంభించి నియోజకవర్గ ప్రజలకు అంకితం చేయనున్నారు. ఇప్పటికే రామకుప్పం మండలం వరకూ కృష్ణా జలాలను తరలించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా చెరువులు నింపి సమృద్ధిగా సాగు, తాగునీరు అందించనున్నారు.

పురిటిగడ్డకు ద్రోహం

సొంతూరు నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నుంచి 1983 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన చంద్రబాబు నాడు టీడీపీ అభ్యర్థి మేడసాని వెంకట్రామనాయుడి చేతిలో 17,429 ఓట్ల తేడాతో ఘోరంగా ఓడిపోయారు. ఆ దెబ్బకు 1985 ఎన్నికల్లో పోటీ చేయడానికే జంకిన చంద్రబాబు పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్ పంచన చేరి 1989లో తమిళనాడు, కర్ణాటక, రాష్ట్ర సరిహద్దుల్లోని కుప్పం నియోజకవర్గానికి వలస వెళ్లారు. అప్పటి నుంచి గూండాయిజం, నోట్ల కట్టలు, దొంగ ఓట్లతో నెగ్గుకొస్తున్నారు. దుర్భిక్ష రాయలసీమను సుభిక్షం చేయడానికి జలయజ్ఞంలో భాగంగా దివంగత వైఎస్సార్ చేపట్టిన హంద్రీ–నీవా సుజల స్రవంతిలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా సాగు, తాగునీరు అందిస్తానని చంద్రబాబు నమ్మబలికారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను 123.641 కి.మీ. పొడవున తవ్వేందుకు 98,85,140 క్యూబిక్ మీటర్ల మట్టి పని, 3,84,457 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేయాలి. 2015–16 ఎస్ఎస్ఆర్ (స్టాండర్డ్ షెడ్యూల్ట్ రేట్స్) ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో మట్టి, కాంక్రీట్ పనులకు రూ.203.11 కోట్లు ఖర్చు అవుతుంది. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటార్లు, ప్రెజర్‌మైన్లు, విద్యుత్ సరఫరా ఏర్పాటుకు రూ.90 కోట్ల వ్యయం అవుతుంది. 2015–16 ధరల ప్రకారం కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.293.11 కోట్ల వ్యయం అవుతుంది. కానీ అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడితో పనుల అంచనా వ్యయాన్ని రూ.413 కోట్లకు పెంచేశారు.

కడప టీడీపీ అధ్యక్షుడికి కానుక..

అంచనా వ్యయం పెంచేసిన పనులను కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు కట్టబెట్టి రూ.120 కోట్లు కాజేయడానికి చంద్రబాబు స్కెచ్ వేశారు. ఆ మేరకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు రూ.413 కోట్లు అంచనా విలువగా నిర్ణయించి 2015 ఆగస్టులో టెండర్లు పిలిచారు. ఆర్కే ఇన్‌ఫ్రా సంస్థకే పనులు దక్కేలా టెండర్లలో నిబంధనలు పెట్టారు. టెండర్లలో ఆ సంస్థ ఒక్కటే నాలుగు శాతం అధిక(ఎక్సెస్) ధరకు కోట్ చేస్తూ షెడ్యూలు దాఖలు చేసింది. చంద్రబాబు ఒత్తిడి మేరకు ఆర్కే ఇన్‌ఫ్రాకు నాలుగు శాతం అధిక ధరకు రూ.430.26 కోట్లకు పనులు కట్టబెట్టారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ.43 కోట్లు దక్కించుకున్న శ్రీనివాసరెడ్డి వాటిని బాబు జేబులో వేసేశారు. అయితే, శ్రీనివాసరెడ్డికి భారీ ఎత్తున లబ్ధి చేకూర్చుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు కట్టబెట్టడంపై అప్పటి టీడీపీ ఎంపీ సీఎం రమేష్ పేచీ పెట్టారు. దీంతో శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు 50% పనులు, మిగతా 50% పనులు సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు సబ్ కాంట్రాక్టు కింద ఇవ్వాలని బాబు ఆదేశించారు. తనతోపాటు శ్రీనివాసరెడ్డి భారీ ఎత్తున లబ్ధి పొందుతుండటాన్ని సహించలేని సీఎం రమేష్ మొత్తం పనులను తనకే కట్టబెట్టాలని మరోసారి పేచీకి దిగారు. దీంతో పనులన్నీ రిత్విక్ ప్రాజెక్ట్స్‌కే అప్పగించేశారు.

రూ.460.88 కోట్లు నీళ్ల పాలు..

కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో సీఎం రమేష్ సంస్థకు రూ.460.88 కోట్లను 2019 ఏప్రిల్ నాటికి ప్రభుత్వం బిల్లుల రూపంలో చెల్లించింది. అంటే కాంట్రాక్టు విలువ కంటే రూ.30 కోట్లు ఎక్కువగా చెల్లించినా పనులు పూర్తి కాలేదు. రూ.99.41 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. నాసిరకమైన పైపులు వేయడం వల్ల వర్షపునీటికే పగిలిపోయాయి. దీన్ని బట్టి కుప్పం బ్రాంచ్ కెనాల్ పనుల్లో సీఎం రమేష్‌తో కలిసి చంద్రబాబు ఏ స్థాయిలో దోపిడీకి పాల్పడ్డారో విశదం చేసుకోవచ్చు. వరుసగా ఏడుసార్లు గెలిపించిన కుప్పం ప్రజలకు సాగునీటి మాట దేవుడెరుగు గుక్కెడు తాగునీళ్లు కూడా అందించకుండా చంద్రబాబు నమ్మకద్రోహం చేశారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్..

ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టాక ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం బాగోగులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కుప్పంను మున్సిపాల్టీని చేశారు. కుప్పం కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీతో పాటు గ్రామాల్లో అంతర్గత రహదారులు, తాగునీరు లాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేసి కృష్ణా జలాలను అందించి సుభిక్షం చేస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చారు. మాట నిలబెట్టుకుంటూ యుద్ధప్రాతిపదికన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేయించారు. ఇప్పటికే కుప్పం బ్రాంచ్ కెనాల్ 74 కి.మీ. వరకూ అంటే రామకుప్పం మండలం మనేంద్రం గ్రామం వరకూ కెనాల్ నీటిని తరలించారు. చెరువులను నింపి సాగు, తాగునీరు అందించనున్నారు.

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తల నియామకం

- ఆరో జాబితాలో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు ఎంపిక
- రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు సజ్జల వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మరో ఆరు శాసనసభ, నాలుగు లోక్‌సభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలను పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఆ వివరాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద శుక్రవారం సాయంత్రం వెల్లడించారు. ప్రజాబలమే గీటురాయిగా.. సామాజిక న్యాయం పాటిస్తూ... ఆరో జాబితా తయారు చేసినట్టు ఈ సందర్భంగా వారు తెలిపారు. గత ఎన్నికల్లో నర్సాపురం లోక్‌సభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా... ఈ సారి బీసీ వర్గానికి చెందిన మహిళా అడ్వొకేట్ గూడూరి ఉమాబాలను ఎంపిక చేశారు. రాజమండ్రి లోక్‌సభ స్థానానికి డాక్టర్ గూడూరి శ్రీనివాస్(బీసీ)ను, గుంటూరుకు ఉమ్మారెడ్డి రమణ, చిత్తూరుకు సిటింగ్ ఎంపీ ఎన్.రెడ్డప్పను ఎంపిక చేశారు. గత ఎన్నికల్లో మైలవరం శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఈ సారి సర్నాల తిరుపతిరావు యాదవ్(బీసీ)ను నియమించారు. గత ఎన్నికల్లో ఎమ్మిగనూరు శాసనసభ స్థానం నుంచి ఓసీ వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దించగా.. ఇప్పుడు మాజీ ఎంపీ బుట్టా రేణుకను నియమించారు. మార్కాపురానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరుకు ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి, గంగాధర నెల్లూరు(ఎస్సీ)కు డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి, నెల్లూరు సిటీకి ఎండీ ఖలీల్‌ను నియమించారు. ఇప్పటివరకూ 63 శాసనసభ, 16 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను కొత్తగా నియమించినట్టయింది. ఇప్పటిదాకా ప్రకటించిన శాసనసభ స్థానాల సమన్వయర్తల్లో 21 మంది ఎస్సీలు, ముగ్గురు ఎస్టీలు, 18 మంది బీసీలు, ఐదుగురు మైనార్టీలు, 16 మంది ఓసీలకు చెందిన వారు ఉన్నారు. 16 లోక్‌సభ స్థానాలకు నియమించిన సమన్వయకర్తల్లో బీసీలు తొమ్మిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ఓసీలు నలుగురు ఉన్నారు.

వ్యవసాయ, ఉద్యాన వర్సిటీ వీసీల నియామకానికి నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ల నియామకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నోటిఫికేషన్ విడుదల చేశారు. వీసీగా నియామకమయ్యే అభ్యర్థులు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా కనీసం 10 ఏళ్ల పాటు పనిచేసి ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి 65 ఏళ్లకు మించకుండా ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో వెల్లడించారు.

కాపాడలేం.. అమ్మేద్దాం!

▶ మొదటి పేజీ తరువాయి

వెల్లడించింది. తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేయటంతో ఈ అంశం అలాగే తొమ్మిదో షెడ్యూల్‌లో తెగని పంచాయితీగా ఉండిపోయింది. హైకోర్టులో కేసు కూడా కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో సదరు భూములను అమ్మేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించడం చర్చనీయాంశంగా మారుతోంది.

కాపాడలేమంటూ కేంద్రం దృష్టికి..

హౌసింగ్‌బోర్డు, దిల్ భూములు కీలక ప్రాంతాల్లో ఉండటంతో వాటిపై కబ్జారాయుళ్ల దృష్టి పడింది. ఇప్పటికే చాలా భూములపై వివాదాలు మొదలయ్యాయి. ఈ భూముల విక్రయానికి ప్రక్రియ మొదలుపెట్టగానే.. అభ్యంతరాలు వస్తాయని, కోర్టులో కేసు ఉండగా ఎలా అమ్ముతారన్న ప్రశ్న వస్తుందని సర్కారు ముందుగానే అంచనా వేసింది. ఈ క్రమంలోనే ఇటు కోర్టుకు, అటు కేంద్ర ప్రభుత్వానికి కూడా ఈ భూముల పరిరక్షణ సవాల్‌గా మారిందన్న విషయాన్ని తెలియపర్చాలని భావిస్తోంది. ''ఇప్పటికే చాలా భూములు వివాదంలో ఉన్నాయి. వాటితోపాటు క్లియర్‌గా ఉన్న మిగతా భూములను పరిరక్షించటం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. కబ్జాలు ఇంకా పెరిగి వివాదాలు కోర్టుల్లో పెరిగేంత వరకు ఉపేక్షించటం సరికాదు. ఈ భూములకు సంబంధించి కోర్టు ఏ నిర్ణయం తీసుకున్నా అనుసరిస్తాం. ముందు వాటిని వేలం ద్వారా విక్రయించి, వచ్చిన డబ్బును తదనుగుణంగా వినియోగించుకోవచ్చు. అందుకు వీలు కల్పించాలి'' అని కోర్టును కోరాలని యోచిస్తోంది. కేంద్రానికి కూడా ఇదే వివరించాలని.. ఈ మొత్తం వ్యవహారాన్ని ఢిల్లీ స్థాయిలో పర్యవేక్షించేందుకు ఓ ప్రతినిధిని కూడా నియమించాలని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

సాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారం కోసం గత ప్రభుత్వం చేసిన తప్పులు కాంగ్రెస్ చేయరాదని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. గత తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరుకు తీరని అన్యాయం చేసిందని, ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో జలవనరుల కల్పనకు జరిగిన పనులు సమగ్ర ప్రణాళికతో చేపట్టలేదన్నారు. గ్రావిటీతో నీరు అందే పథకాలు ఆర్డీఎస్, జూరాల మాత్రమేనని, గత ప్రభుత్వం ఆర్డీఎస్ ఆనకట్టను పట్టించుకోలేదని, జూరాలను సమర్థవంతంగా నిర్వహించలేదన్నారు. ఎత్తిపోతలను అరకొర స్థాయిలో పూర్తి చేశారన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో నీటి సమస్య పరిష్కారం కావాలంటే జీఓ 72, 69తోపాటు పేట– కొడంగల్, భీమా– కృష్ణానది సంగమం నుంచి తీసుకునే పథకంపై పరిశీలన చేయాలని కోరారు.

4న రౌండ్ టేబుల్ సమావేశం

పాలమూరు: కృష్ణానది నీళ్లు– ఉమ్మడి పాలమూరు భవిష్యత్ అనే అంశంపై ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లాకేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు జల వనరుల కల్పనలో ఇంత కాలం జరిగిన అన్యాయం.. భవిష్యత్‌లో మళ్లీ జరగకుండా ఉండటానికి చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా అబద్ధాలు చెప్పకుండా ప్రణాళిక ప్రకారం జిల్లాకు న్యాయం చేసేలా ఇప్పటి ప్రభుత్వం కృషిచేయాలన్నారు. సమావేశానికి మేధావులు, విద్యావంతులు, ప్రజా సంఘాల నాయకుల ప్రతిఒక్కరూ హాజరుకావాలని సూచించారు.

కొత్తకోటలోనే సీఓఈ సెట్ పరీక్ష కేంద్రం

కొత్తకోట రూరల్: ఈ నెల 4న సీఓఈ సెట్‌ను కొత్తకోట పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న జీటీ నారాయణ పాఠశాల భవనంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల (వీపనగండ్ల)లో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.దయాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీపనగండ్ల ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల అని హాల్‌టికెట్ల మీద పరీక్ష కేంద్రం చిరునామా ఉంటుందని.. అభ్యర్థులు అక్కడికి వెళ్లొద్దని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందని.. అభ్యర్థులు కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు.

ఆపదమొక్కుల అభయాంజనేయుడు

- నేటి నుంచి ఊర్కొండపేట బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- సింధూర తిలకం లేకుండా స్వామి వారి దర్శనం
- ఉత్సవాలకు జిల్లాతోపాటు ఇతర జిల్లాల భక్తుల రాక
- జాతర ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



విద్యుత్ దీపాల అలంకరణతో మెరిసిపోతున్న ఆలయం



అభయాంజనేయుడి మూలవిరాట్

ఊర్కొండ: ఆపదలో ఉన్న వారికి ఆపద్బాంధవుడిగా.. పిలిస్తే పలికే ఆంజనేయుడిగా పేరొందిన ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. కొండల మధ్య స్వామి వారు కొలువుదీరారని చరిత్ర చెబుతుండగా, ఆలయానికి తూర్పు వైపున ఉన్న గుండంలో స్నానమాచరిస్తే కష్టాలు తొలగుతాయని ప్రజల నమ్మకం. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు తరలివస్తుంటారు.

తైలంతో ఉన్న భారీ విగ్రహం దర్శనం..

ఇక్కడ ఆలయంలో స్వామి వారికి సింధూర తిలకం ఉండదు. తైలంతో ఉన్న భారీ విగ్రహం భక్తులకు దర్శనమిస్తుంది. భారీ విగ్రహానికి తగ్గట్టుగానే గర్భాలయం సైతం ఎత్తుగా ఉంటుంది. తైలాభిషేకం, నువ్వుల నూనె స్వామి వారికి ఇష్టమని భక్తులు పోటీ పడి సమర్పిస్తుంటారు. అదే విధంగా ప్రతి మంగళ, శనివారాల్లో వ్రతాలు అర్చనలు, హారతులు, అభిషేకాలు, పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. ప్రతి శనివారం రాత్రి స్వామి వారికి పల్లకీ సేవతో పాటు 108 తమలపాకులు, జిల్లెడు పూలను సమర్పిస్తారు. 90 ఏళ్ల నాటి ఇనుప రథం ఊరేగించడం విశిష్టత. స్వామివారి జాతర ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. కొవిడ్ నేపథ్యంలో జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..



అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతరకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్వామి వారి దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశాం.

– సత్యచంద్రారెడ్డి, ఆలయ ఈఓ

పోలీస్ పహారా..

జాతరలో ఎలాంటి అపశృతులు జరగకుండా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కూడా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ అధికారులు, స్థానిక పోలీసులు పలు సూచనలు చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక కార్యక్రమాలు...

శనివారం ఉదయం 8 గంటలకు ఆలయ అర్చకులు చిరువెళ్లి కృష్ణమూర్తి ఇంటి నుంచి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఆలయ ప్రవేశం చేయడంతో జాతర ప్రారంభం అవుతుంది. అనంతరం ధ్వజారోహణం, మూల స్వామి వారికి పంచామృత అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, వెండి ఆభరణాల అలంకరణతో సహస్త నామార్చన నిర్వహిస్తారు. 4వ తేదీన ఆదివారం ప్రత్యేక పూజలు సహస్త నామార్చన, స్వామి వారికి గజ వాహన సేవ, భజనలు, ప్రదోష పూజలు, 5వ తేదీ సోమవారం ఉదయం పూజలు, రథోత్సవం, పంచసూక్తులతో పూజలు, 6వ తేదీ మంగళవారం స్వామి వారికి మాన్యసూక్తులతో అష్టోత్తర నామావళి, మంగళ హారతి, రాత్రికి పల్లకీసేవ 7వ తేదీ బుధవారం ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజలు, రాత్రి ఒంటె వాహన సేవ, 8వ తేదీ గురువారం స్వామి వారికి అభిషేకం, అర్చనలు, రాత్రికి నెమలి వాహన సేవ, గ్రామ భజన మండలిచే భజనలు, 9వ తేదీ శుక్రవారం స్వామి వారికి పూజలు, 10వ తేదీ 11 గంటలకు చక్రతీర్థం, అభిషేకం, మంత్ర పుష్పం, సాయంత్రం 6 గంటలకు ఉత్సవ విగ్రహాలు ఆలయ అర్చకుడి గృహానికి భజనలు, మంగళహారతులతో చేరుస్తారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై ఉద్యమిస్తాం

నవాబుపేట: బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారించే వరకు పోరాటం చేస్తునే ఉంటామని ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, ఆర్.శ్రీరాం తెలిపారు. శుక్రవారం వారు మండల కేంద్రంలోని ఎస్‌బీఐతో పాటు మరికల్, కొల్లూర్ బ్యాంకులో యూనియన్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరోన సమయంలో ఉద్యోగులు ధైర్యసాహసాలతో చేసిన విధి నిర్వహణ చాలా గొప్పదని వివరించారు. అలాంటి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యల పరిష్కారం కోసం సంఘం ద్వారా త్వరలో కార్యాచరణ రూపొందించి ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మ్యాడ్యూల్, నరేష్, నందన్, శాండిల్యా, వెంకటేశ్వర్లు, రాములు, మల్లేష్ తదితరులు ఉన్నారు.



బ్యాంక్ ఉద్యోగులతో రాష్ట్ర నాయకులు

కార్యకర్తలు అధైర్య పడొద్దు



మక్తల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్ శ్రీనివాస్‌గౌడ్

మక్తల్: బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, ఏ ఆపదొచ్చినా ఆదుకుంటామని మాజీ మంత్రులు సత్యవతిరాథోడ్, శ్రీనివాస్‌గౌడ్ భరోసా ఇచ్చారు. శుక్రవారం పట్టణంలోని హాల్‌లో ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు ఎవరూ చేయలేదన్నారు. రైతులతో రాజకీయం చేస్తే సరిపడదని, 7,700కోట్లు రైతు బంధులో జమచేయాలని ఉన్నప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుబంధు వేయలేదన్నారు. 10 ఏళ్ల నుంచి చేసిన అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు కనిపించలేదన్నారు. తప్పులు చేసిన వాటిని సరిదిద్దుకుంటామన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, దేవరి మల్లప్ప, రజినిసాయిచంద్, వెంకటేశ్వర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ గాయిత్రి, నర్సింహగౌడ్, రాజేష్‌గౌడ్, సలీం, లలిత, మహిపాల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టైగర్ ట్రాకర్లకు ఆర్చరీ పోటీలు



ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న వాచర్లతో డబ్ల్యూడబ్ల్యూఎఫ్, అటవీశాఖ అధికారులు

మన్ననూర్: అటవీశాఖలో టైగర్ ట్రాకర్లుగా పనిచేస్తున్న చెంచు యువకులకు చెంచులక్ష్మి రెస్టారెంట్ ప్రాంగణంలో శుక్రవారం ఆర్చరీ (విలు విద్య), విద్యార్థులకు వక్తృత్వ పోటీలను డబ్ల్యూడబ్ల్యూఎఫ్, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను వీపీఆర్ డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా చైర్మన్ అనిల్‌కుమార్ ప్రారంభించగా.. మన్ననూర్, అమ్రాబాద్, మద్దిమడుగు, దోమలపెంట, లింగాల, కొల్లాపూర్, అచ్చంపేట రేంజ్ పరిధిలోని 80 మంది టైగర్ ట్రాకర్లు, ప్రొటెక్షన్, స్ట్రైక్ ఫోర్స్ వాచర్లు పాల్గొన్నారు. ఈ క్రమంలో ట్రాకర్లు మొత్తం చెంచు యువకులే కావడంతో తమదైన శైలిలో ప్రతిభ ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మన్ననూర్ రేంజ్, రెండో బహుమతి కొల్లాపూర్, మూడో బహుమతి దోమలపెంట రేంజ్ వాచర్లు దక్కించుకున్నారు. అలాగే అడవులు, వన్యప్రాణుల మనుగడ– మన బాధ్యత అనే అంశంపై గ్రామంలోని గిరిజన ఉన్నత పాఠశాల, పీటీజీ, సాంఘిక సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి.. అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్‌కు చెందిన కరుణ్‌బల్లా, ఫరీద టంపల్, ప్రదీప్, శ్రీనివాస్, అబ్రహం, ఎఫ్ఆర్‌ఓ రవికుమార్, డీఆర్‌ఓ లక్ష్మీకాంతరావు, ఎఫ్ఎస్‌ఓలు ముజీబ్, ఆనంద్, మంజుల, మహేందర్, పర్వతాలు, బాబలి తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో నిలకడగా నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరి నిలకడగా కొనసాగుతోంది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.